సాక్షి
ఒడిశా
బుధవారం । 3 । జూలై । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.1,40,108లు, బంగారం 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



రథయాత్రకు అందరి సహకారం అవసరం

శ్రీజగన్నాథుని రథయాత్రను జయప్రదం చేయడానికి అందరి సహకారం అవసరమని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అన్నారు.

- 8లో.

రథయాత్రకు 2 రోజులు సెలవు



భువనేశ్వర్: ఈ సంవత్సరం రథయాత్ర చాలా అరుదు. ఈ ఏడాది రెండు రోజుల కార్యక్రమం కావడంతో 7వ తేదీన రథయాత్ర, 8వ తేదీన మరుసటి రోజు సెలవు ఉంటుందని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి మంగళవారం ప్రకటించారు.

న్యూస్‌రీల్

నో ఫ్లయింగ్ జోన్లు ఏర్పాటు



భువనేశ్వర్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్ర పర్యటన పురస్కరించుకుని పూరీ, ఖుర్దా, భువనేశ్వర్‌లను నో ఫ్లయింగ్ జోన్, నో డ్రోన్ జోన్లుగా ప్రకటించారు. ఈ వారంలో ఆమె ఒడిశాలో పర్యటించనున్న దృష్ట్యా ఈ చర్య చేపడుతున్నట్లు డైరెక్టరేట్ ఆఫ్ ఇంటెలిజెన్స్ మంగళవారం తెలియజేసింది. ఈనెల 6 నుంచి 9 తేదీల మధ్య రాష్ట్రపతి రాష్ట్రంలో బస చేస్తున్న సందర్భంగా భద్రతా ఏర్పాట్లలో భాగంగా ఈ ఆంక్షలు విధించినట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

రాష్ట్రపతి పర్యటన వివరాలు

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జూలై 6న రాష్ట్ర రాజధాని భువనేశ్వర్ నగరానికి చేరుకుని సాయంత్రం స్థానిక జయదేవ్ భవన్‌లో ఉత్కళమణి గోపబంధు దాస్ 90వ వర్ధంతి సందర్భంగా జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. తర్వాత ఆమె తొలిసారిగా జూలై 7న పూరీలో జరిగే రథయాత్రలో పాల్గొంటారు. ఆమె యాత్రికుల పట్టణంలో రాత్రి గడిపి, మరుసటి రోజు ఉదయం పూరీ బీచ్‌కి నడక కోసం వెళ్తారు. జూలై 8న ఆమె తిరిగి రాష్ట్ర రాజధానికి చేరుకుని మధ్యాహ్నం ఖండగిరి, ఉదయగిరి గుహలను సందర్శిస్తారు. అనంతరం బిభూతి కనుంగో కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ విద్యార్థులతో సంభాషిస్తారు. ఆ తర్వాత ఒంధారువా బ్రహ్మ కుమారీల కార్యక్రమానికి హాజరవుతారు. జూన్ 9న ఢిల్లీకి బయలుదేరే ముందు జట్నీలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నైజర్) 13వ స్నాతకోత్సవంలో పాల్గొంటారు.

ఎమ్మెల్యే సత్యజీత్‌కు సన్మానం



ఎమ్మెల్యే సత్యజీత్‌ను సన్మానిస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ శాసనసభ నియోజకవర్గం ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగోకు పద్మపూర్‌లోని అభ్యాస్ టెక్నో స్కూల్ మంగళవారం ఘనంగా సన్మానించింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గుణుపూర్ శాసనసభ నుంచి గెలిపొందిన సత్యజీత్ పద్మపూర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా పద్మపూర్‌లోని అభ్యాస్ పాఠశాలకు చెందిన కార్యదర్శి లాడి తుకారాం, ప్రిన్సిపాల్ దివ్యదేవాశీష్ దుబే తదితరులు ఆయనకు స్వాగతం పలికారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని ఆయన సూచించారు.

విస్తృతంగా ఎక్సైజ్ దాడులు



ఊట ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

రాయగడ: నాటుసారా తయారీ కేంద్రాలపై జిల్లా ఎక్సైజ్ శాఖ సోమవారం విస్తృతంగా దాడులు చేపట్టింది. సదరు సమితి పరిధి భైరాగహాలువలో నిర్వహించిన దాడుల్లో 4,200 లీటర్ల ఊటను స్వాధీనం చేసుకోగా, ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతమైన కెరడలో నిర్వహించిన దాడుల్లో 3,300 లీటర్ల ఊటతో పాటు 210 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే కెరడ పంచాయతీలోని ఒనిజా గ్రామంలో నిర్వహించిన దాడుల్లో 2600 లీటర్ల ఊట, మరో 260 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలియజేశారు. నాటుసారా తయారీ కేంద్రాలపై విస్తృతంగా దాడులు నిర్వహించి నాటుసారా అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎక్సైజ్ శాఖ ఎస్ఐ సంజయ్ ప్రధాన్ తెలియజేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



లోయలోకి దూసుకెళ్లిన లారీ

రాయగడ: టికిరి నుంచి రాయగడకు వస్తున్న ఒక లారీ గుమ్మ ఘాట్ రోడ్డులో అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లిన ఘటనలో పెను ప్రమాదం తప్పింది. గుమ్మ ఘాటీ మలుపులో లారీ అదుపుతప్పగా, డ్రైవర్ అతి చాకచక్యంతో లారీని లోయలోకి తీసుకెళ్లి నిలిపివేశాడు. ఈ ప్రమాదంలో లారీ బ్యాలెన్స్‌గా నిలివకపోయి ఉంటే సుమారు 50 మీటర్ల లోయలోకి పడిపోయే అవకాశం ఉండేది. అనంతరం ఆ మార్గంలో ప్రయాణిస్తున్న మరికొందరు వాహన చోదకులు డ్రైవర్‌ను జాగ్రత్తగా బయటకు తీసుకొచ్చారు.

పిడుగుపాటుపై బ్రహ్మాస్త్రం..!





పంట పొలాల్లో తాటి చెట్లు

- తాటిచెట్ల సంరక్షణకు ప్రభుత్వం నిర్ణయం
- సాగుతో మరణాలు అరికట్టేందుకు చర్యలు
- చెట్లు నరికేందుకు ముందస్తు అనుమతి తప్పనిసరి

భువనేశ్వర్: పిడుగుపాటు వల్ల మరణాలు సంభవించకుండా సంప్రదాయ విధానాన్ని అవలంబించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. విస్తృతంగా తాటి చెట్ల పెంపకం మరియు ఇప్పటికే ఉన్నవాటిని నరికివేయకుండా సంరక్షించాలని సంకల్పించింది. ఈ మేరకు గతేడాది సెప్టెంబర్ నెలలో అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే ఈ ఏడాది కట్టుదిట్టమైన కార్యాచరణకు ప్రస్తుత యంత్రాంగం నడుం బిగించడం విశేషం. వర్ష రుతువు ఆరంభం కావడంతో తొలి విడత కింద 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో 19 లక్షల తాటిచెట్లు నాటేందుకు లక్ష్యంగా నిర్ధారించారు. కటక్, భద్రక్, భువనేశ్వర్, బాలేశ్వర్ తదితర కోస్తా ప్రాంతాల్లో తొలి విడత కింద అత్యధిక ప్రాధాన్యత కల్పించనున్నట్లు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) దేబిదత్త బిస్వాల్ తెలిపారు. పిడుగుపాటు సమయంలో తాటి చెట్లు ఉత్తమ సహజ వాహకాలుగా పనిచేస్తాయి. ఈ విపత్తు నుంచి ప్రాణ నష్టం నివారిస్తాయి. కాబట్టి ప్రభుత్వం గతేడాది సెప్టెంబర్ నెలలో తీసుకున్న నిర్ణయాన్ని అటవీ శాఖ ఖచ్చితంగా అమలు చేస్తుందని వివరించారు. ఈ నిర్ణయం మేరకు 2024–25 ఆర్థిక సంవత్సరంలో విభాగం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 19 లక్షల తాటి చెట్లను నాటనుంది. ప్రతీ అటవీ మండలం సరిహద్దు ప్రాంతాల్లో 4 చొప్పున తాటి చెట్లను నాటుతారు. ఇందు కోసం సమగ్రంగా రూ.7 కోట్లు వెచ్చించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రస్తుత చెట్లకు సంరక్షణ

కొత్తగా తాటిచెట్లు నాటడంతో పాటు ప్రస్తుతం ఉన్న చెట్లను సంరక్షించాలని విభాగం నిర్ణయించింది. ప్రజలు తమ ఆవరణలో ఉన్న తాటి చెట్లని నరికేందుకు అటవీ శాఖ అనుమతి అవసరమన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రైవేట్ భూమిలో తాటి చెట్లను నరికితే అనుమతి అవసరం లేదని లోగడ ప్రకటించారు. పరిణామాలను పరిశీలించిన మేరకు ఆంక్షలు విధించారు. ఆంక్షలు లేకపోవడంతో విచ్చల విడిగా తాటి చెట్ల నరికివేత పుంజుకుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు తాటి చెట్ల జాడ అంతరించిపోయి ఆందోళనకర పరిస్థితులు ప్రేరేపించినట్లు గుర్తించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాటి చెట్ల నరికివేతతో పిడుగుపాటు కారణంగా మరణాలు పెరుగుతున్నట్లు తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో సింహభాగం పిడుగుపాటు మరణాలు సంభవిస్తున్నాయి.



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న పీసీసీఎఫ్ దేబిదత్త బిస్వాల్

గ్రామీణ ప్రాంతాల్లో 90 శాతం పిడుగుపాటు మరణాలు సంభవిస్తుండగా పట్టణ, నగర ప్రాంతాల్లో ఈ మరణాలు 10 శాతానికి పరిమితం అవుతున్నట్లు అనుబంధ వర్గాలు విశ్లేషించాయి. 1999 సంవత్సరపు పెను తుపాను వైపరీత్యంతో కేంద్రాపడా, జగత్‌సింగ్‌పూర్, పూరి, కటక్, బాలాసోర్, భద్రక్, గంజాం జిల్లాల్లో తాటి చెట్లకు అపార నష్టం వాటిల్లింది.

ఐదేళ్లలో 1,472 మంది మృత్యువాత

గత 5 ఏళ్లలో రాష్ట్రంలో 1,472 మంది పిడుగుపాటుకు బలై అకాల మరణం పొందారు. మరో 145 మంది గాయపడ్డారు. పిడుగుపాటు మృతుల కుటుంబీకులకు సహాయ నిధి నుంచి రూ.4 లక్షల చొప్పున ప్రభుత్వం పరిహారం చెల్లించింది. పిడుగుపాటుతో 40 శాతం వైకల్యం పొందిన పీడితులకు రూ.74 వేలు, 60 శాతం వైకల్యానికి రూ.2 లక్షల 50 వేలు చొప్పున పరిహారం చెల్లించారు. పిడుగుపాటుతో గాయపడి 7 రోజులు పైబడి ఆస్పత్రిలో నిరవధికంగా చికిత్స పొందిన బాధితులకు రూ.16 వేలు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం పరిహారం విడుదల చేస్తుంది. వారం రోజుల కంటే తక్కువగా ఆస్పత్రిలో చికిత్స పొందిన బాధితులకు రూ. 5,400 చొప్పున పరిహారం చెల్లించాల్సి వస్తుందని సమీక్ష సమావేశంలో అధికారులు వివరించారు.

హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు



నిందితులను కోర్టుకు తరలిస్తున్న పోలీసులు



రినా జెన్న మృతదేహం (ఫైల్)

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ సమితి బిరిపాదొరొ గ్రామానికి చెందిన రినా జెన్న(27) అనే దివ్యాంగురాలి హత్యకు సంబంధించి గుడారి పోలీసులు ఇద్దరు నిందితులను మంగళవారం అరెస్టు చేసి మంగళవారం కోర్టుకు తరలించారు. అరెస్టైనవారిలో గుణుపూర్ పోలీసుస్టేషన్ పరిధి సనొసాహిపూర్ గ్రామానికి చెందిన టొంకొధొరొ రెడ్డి, పద్మపూర్ సమితి బిరిపాదొరొ గ్రామానికి చెందిన గాయత్రీ లిమ్మలు ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జూన్ 28వ తేదీన రినా జెన్న అనే దివ్యాంగురాలి మృతదేహాన్ని పోలీసులు పద్మపూర్ సమీపంలోని అంబాబడి కొండ ప్రాంతంలో స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు క్లూస్ టీమ్‌తో పాటు పోలీసులు నిర్వహించిన దర్యాప్తులో నిందితులను గుర్తించి అరెస్టు చేసినట్లు వెల్లడించారు. నిందితురాలు గాయత్రీ అతని భర్త బినోద్ లిమ్మతో కలిసి బిరిపాదొరొ గ్రామంలో నివసిస్తుండేది. ఈ నేపథ్యంలో అదే గ్రామంలోని రినాతో తన భర్త బినోద్ చనువుగా మాట్లాడుతున్నాడని అనుమానిస్తుండేది. ఈ క్రమంలో రినాను ఎలాగైనా అడ్డు తొలగించాలని వ్యూహం పన్నింది. అందుకు తనకు బంధువైన టొంకొధొరొ రెడ్డి సాయాన్ని కోరింది. దీంతో ఇద్దరూ ఒక పథకం పన్నారు. పద్మపూర్‌లోని మిషన్ శక్తి కార్యాలయంలో కార్యకర్తగా విధులు నిర్వహిస్తున్న రినా జెన్న జూన్ 26వ తేదీన పద్మపూర్‌లో మీటింగ్ ఉందని ఇంట్లో చెప్పి వెళ్లింది. ఇదే అదునుగా భావించిన గాయత్రీ, టొంకొధొరొలు మాయమాటలు చెప్పి ఒక నిర్మానుష్యమైన ప్రాంతానికి ఆమెను తీసుకెళ్లారు. అనంతరం తమతో తీసుకొచ్చిన బ్లేడ్ సాయంతో రినా గొంతుకోసి దారుణంగా హతమార్చారు. అనంతరం ఆ బ్లేడ్‌ను సమీపంలో ఒక చెరువులో పారేశారు. మృతదేహాన్ని అంబాబడి కొండల్లో పడేశారు. అయితే తన కూతురు మీటింగ్ కోసమని వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆమె కుటుంబీకులు జూన్ 27వ తేదీన గుడారి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో జూన్ 28వ తేదీన అంబాబడి కొండల మధ్య మృతదేహం పడి ఉందన్న సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలాకు వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. అనంతరం దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేశారు.

• మర్యాదపూర్వక భేటీ



కొత్తగా నియామకమైన ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా స్థానిక రాజ్ భవన్‌ను మంగళవారం సందర్శించారు. రాష్ట్ర గవర్నర్ రఘుబర దాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సంభాషించారు.

- భువనేశ్వర్

'మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం'



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హికక తదితరులు

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ సమితిలో మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నామని బిసంకటక్ ఎమ్మెల్యే నీలమాధవ హికక అన్నారు. బిసంకటక్‌లోని పంచాయతీ సమావేశంలో మంగళవారం పాల్గొన్న ఆయన, వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు మౌలిక సౌకర్యాలు అందాలంటే ప్రధానంగా రహదారులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని, దానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. ప్రస్తుతం సమితిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులతో చర్చించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలను సరఫరా చేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా సాగునీటి సౌకర్యాలను మెరుగుపరచాలన్నారు. సమితి బీడీవో సదాశివ నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గౌరిప్రసాద్ పాత్రో, సమితి అధ్యక్షురాలు యశోద హుయిక, ఉపాధ్యక్షుడు దేవిప్రసాద్ పట్నాయక్, తహసీల్దార్ కె.వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

మహిళల ఆగ్రహం



ఆందోళన చేస్తున్న మిషన్ శక్తి మహిళలు

- బొరిగుమ్మ సమితి కార్యాలయానికి తాళాలు

జయపురం: బొరిగుమ్మ బీడీవో సంధ్యా సామరథ్ మిషన్ శక్తి మహిళలపై అనేక సమయాల్లో అవమానకరంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ బీడీవో కార్యాలయానికి మహిళలు మంగళవారం తాళాలు వేసి ఆందోళన చేపట్టారు. బీడీవోకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొద్దిరోజుల క్రితం ఒక సెంట్రల్ టీమ్ మిషన్ శక్తి ప్రాజెక్టులను పర్యవేక్షించేందుకు రాగా, ఆ సమయంలో మిషన్ శక్తి సభ్యులపై బీడీవో అవమానకరంగా వ్యవహరించారని ఆరోపించారు. ఆమె ఎల్లప్పుడూ అసభ్య పదజాలంతో దూషిస్తారని మండిపడ్డారు. ఎవరైనా ప్రశ్నిస్తే ఉద్యోగాల నుంచి తొలగిస్తానని హెచ్చరిస్తున్నారని వాపోయారు. స్వయం సహాయక గోష్టికి గత ఏప్రిల్ నుంచి రుణాలు మంజూరు చేయలేదన్నారు. అందుకే అవమానాలు భరించలేక ఆందోళన చేస్తున్నట్లు పేర్కొన్నారు. విషయం తెలిసిన పోలీసు అధికారి యుగళ కిశోర్ షా, సబ్ ఇన్‌స్పెక్టర్ రచిత మడ్కామి, ఏఎస్ఐ సస్మిత నాయిక్‌లు సంఘటన స్థలానికి చేరుకొని మహిళలకు నచ్చజెప్పారు. అనంతరం బీడీవో సంధ్యా సామరథ్ కార్యాలయానికి వచ్చి ఆందోళన చేస్తున్న మహిళలతో చర్చించారు. తన వలన జరిగిన సంఘటనకు విచారం వ్యక్తం చేస్తూ, ఇకపై అటువంటి సంఘటనలు పునరావృతం కావని హామీ ఇచ్చారు. బీడీవో ఇచ్చిన హామీతో మహిళలు ఆందోళన విరమించారు. ఆందోళనలో మిషన్ శక్తి మహిళా సంఘ అధ్యక్షురాలు స్నేహలత పండ, కార్యదర్శి కేదార ప్రియ బిశాయి, వి.పద్మినీ కుమారి, హీరామణిమాలి, మమతా ముదులి, జశోద గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రథయాత్రకు పటిష్టంగా భద్రతా ఏర్పాట్లు

- 180 ప్లాటూన్ దళాల పోలీసుల మోహరింపు
- డీజీపీ అరుణ్ కుమార్ షడంగి



సమీక్ష నిర్వహిస్తున్న డీజీపీ అరుణ్ కుమార్ షడంగి

భువనేశ్వర్: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన జగన్నాథుని రథయాత్ర కోసం పూరీ పుణ్యక్షేత్రంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు జరుగుతున్నాయని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) అరుణ్ కుమార్ షడంగి తెలిపారు. రథయాత్ర–24 సజావుగా సాగేందుకు పోలీసు సంసిద్ధతను పూరీ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఆయన సమీక్షించారు. ఈ సమీక్షకు విభాగం సీనియర్ అధికారులు ఇన్‌ఛార్జిలు హాజరయ్యారు. ఈనెల 7, 8 తేదీల్లో జరిగే మహాయాత్రని సజావుగా నిర్వహించేందుకు భద్రత, ట్రాఫిక్, రద్దీ నియంత్రణ, శాంతి భద్రతల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రథయాత్ర సజావుగా, సకాలంలో నిర్వహించడం కోసం యాత్రికుల పట్టణంలో మొత్తం 180 ప్లాటూన్ల పోలీసు బలగాలను మోహరించనున్నట్లు తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 10 లక్షల మందికి పైగా భక్తులు యాత్రకు తరలివచ్చే అవకాశం ఉందన్నారు. సముద్రతీర యాత్రికుల పట్టణంలో వార్షిక రథయాత్ర సందర్భంగా తీర ప్రాంత భద్రతను నిర్ధారించడానికి, సమర్థవంతమైన నిఘా కోసం ఇండియన్ కోస్ట్ గార్డ్ తన బలగాలను మరియు హెలికాప్టర్లను మోహరించాలని అభ్యర్థించినట్లు ఆయన పేర్కొన్నారు. భద్రతా చర్యల్లో భాగంగా 4 మంది అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసులు, 6 మంది ఇన్‌స్పెక్టర్ జనరల్‌లు, 14 మంది డీఐజీలు, 130 మంది ఇన్‌స్పెక్టర్లను పర్యవేక్షణ కోసం నియమించనున్నారు. వీరితో పాటు రథయాత్రలో 90 మంది ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌లను కూడా మోహరిస్తారు. ఈ సంవత్సరం రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, రథాలను లాగడం మరియు ప్రముఖులకు భద్రత కల్పించడం వంటి వాటిపై దృష్టి సారిస్తారు.

రాష్ట్రపతి పర్యటనకు ప్రత్యేక ఏర్పాట్లు

మహోత్సవాన్ని తిలకించేందుకు విచ్చేసే భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటనకు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు. ఆమె హెలికాప్టర్‌లో పూరీకి చేరుకుని రాజ్ భవన్‌కు వెళ్లనున్నారు. ఆ తర్వాత రాష్ట్రపతి రథయాత్ర ఉత్సవాల్లో పాల్గొంటారని ఇప్పటివరకు అందుబాటులో ఉన్న సమాచారంగా పేర్కొన్నారు. ఎలాంటి పరిస్థితినైనా తక్షణమే ఎదుర్కొనేందుకు బాంబు నిర్వీర్య స్క్వాడ్‌లతో పాటు స్నిఫర్ డాగ్‌లు, షార్ప్ షూటర్లను మోహరిస్తారు. డ్రోన్‌తో నిఘా కోసం ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లతో రాష్ట్ర సాయుధ దళం (ఎస్ఏఎఫ్) యొక్క మూడు ప్లాటూన్లను కేటాయించారు. 5 కంపెనీల ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కోసం కేంద్ర ప్రభుత్వానికి అభ్యర్థించారు.

క్లుప్తంగా

'రేపటి దేశవ్యాప్త విద్యా సంస్థల బంద్ విజయవంతం చేయండి'



విద్యా సంస్థల బంద్‌ను పిలుపునిస్తూ టెక్కలిలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ ప్రతినిధులు

టెక్కలి: విద్యారంగంలో జరుగుతున్న అవకతవకలపై గురువారం చేపట్టనున్న దేశ వ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు యు.దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం టెక్కలిలో పోస్టర్లను ఆవిష్కరించారు. దేశ వ్యాప్తంగా వివిధ రకాల విద్యా పరీక్షల్లో ఎన్నో అక్రమాలకు పాల్పడుతున్నారని, అలాగే పాఠశాల విద్యా పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ చేపట్టనున్న ఈ బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బి.తరుణ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టం.. కొత్త కేసు



లేవలేని స్థితిలో క్షతగాత్రుడు గిరి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని అరసవల్లి మిల్లు కూడలి సమీపంలో మంగళవారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. కొత్తగా రూపొందించిన భారతీయ న్యాయ సంహిత చట్టం కింద తొలి కేసు నమోదు చేయడం విశేషం. ట్రాఫిక్ సీఐ ఎం.అవతారం చెప్పిన వివరాల మేరకు నగరంలోని నానుబాలవీధికి చెందిన గోరుచుట్టి గిరి (24) తన మిత్రుడు గుణశేఖర్‌తో కలిసి పాతబస్టాండు నుంచి అరసవల్లి మిల్లు జంక్షన్ వైపు ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. గుణశేఖర్ బండి నడుపుతున్నాడు. అదే సమయంలో వెనుకగా వచ్చిన కారు ఉమెన్స్ కాలేజీ రోడ్డు వెళ్లే క్రమంలో అతి వేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో గిరి, గుణశేఖర్ ఇద్దరూ రోడ్డుపై పడిపోయారు. పడిపోయిన గిరిని స్థానికులు కూర్చోబెట్టి తర్వాత లేపినా లేవలేని స్థితిలో ఉండటంతో వెంటనే 108 అంబులెన్సులో వైద్య చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. గిరికి నడుము ఎడమ వైపు ఎముక విరిగినట్లు వైద్యులు ధ్రువీకరించడంతో ఎస్‌ఐ మెట్ట సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ ఫలితాలు వెల్లడి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఓపెన్ స్కూల్ సొసైటీ తాజాగా విడుదల చేసిన ఈ ఫలితాల్లో శ్రీకాకుళం జిల్లా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. టెన్త్ పరీక్షకు 459 మంది విద్యార్థులు హాజరు కాగా 51.85 శాతం ఉత్తీర్ణతతో 238 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే ఇంటర్మీడియెట్ పరీక్షలకు 1108 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 52.13 శాతం ఉత్తీర్ణతతో 633 మంది పాసయ్యారు. టెన్త్, ఇంటర్ ఫలితాల్లో రెండింటిలోను శ్రీకాకుళం జిల్లా 19వ స్థానంలో నిలిచింది. కాగా పరీక్షలకు హాజరై ఉత్తీర్ణులైన విద్యార్థులు వారి ప్రింటెడ్ మార్క్స్ మెమోలను వారి అధ్యయన కేంద్రాలకు వెళ్లి నేరుగా పొందవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. రీకౌంటింగ్‌కు సబ్జెక్టుకు రూ.200, రీ వెరిఫికేషన్‌కు సబ్జెక్టుకు రూ.1000 చొప్పున ఆన్‌లైన్ సెంటర్ల ద్వారా గానీ, ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్‌నందు పొందుపరిచిన గేట్‌వే పేమెంట్ ద్వారా ఫీజు చెల్లించాలని ఆయన కోరారు. డీడీలు, మరే ఇతర చెల్లింపులు అంగీకరించరని డీఈఓ స్పష్టం చేశారు.

క్లాస్‌వర్క్, హాస్టల్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి



మెస్‌లో వీసీ రజనితో భోజనం చేస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: క్లాస్‌వర్క్, హాస్టల్ నిర్వహణ, మెస్‌లపై ప్రత్యేక దృష్టిపెట్టాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ కేఆర్ రజిని అన్నారు. వర్సిటీ వసతి గృహాన్ని, మెస్, ఆల్ట్రా మోడ్రన్ కిచెన్‌ను అధికారులతో కలిసి మంగళవారం ఆమె పరిశీలించారు. అనంతరం మెస్‌ను పరిశీలించారు. మెస్ పూర్తి స్థాయిలో విద్యార్థులకు అందుబాటులో ఉందని వీసీ అన్నారు. అకడమిక్ క్యాలెండర్ మేరకు క్లాస్‌వర్క్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. మంగళవారం నాటికి మెస్‌లో 360 మంది భోజనం చేశారని, పూర్తిస్థాయిలో విద్యార్థులు రెండు రోజుల్లో హాజరు కావచ్చునని అన్నారు. వంశధార, నాగావళి, మహేంద్రతనయ వసతి గృహాల్లో మరమ్మతులు సైతం చేసినట్లు చెప్పారు. రన్నింగ్ నీటి సౌకర్యం, నాణ్యత గల మరుగు దొడ్లు వంటి సౌకర్యాలు కల్పించామన్నారు. నిర్వహణకు సైతం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆమె వెంట రిజిస్ట్రార్ పి.సుజాత, చీఫ్ వార్డెన్ ఎస్.లోకేశ్వరి, ఓఎస్‌డీ యు.కావ్యజ్యోత్స్న ఉన్నారు.



పర్లాకిమిడి: మొక్కల పంపిణీ మొబైల్ వాహనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం



పర్లాకిమిడి: బోయకొండపై మొక్కలు నాటుతున్న విద్యార్థులు

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

● కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్



జయపురం: మొక్క నాటుతున్న జడ్జి సత్యనారాయణ



జయపురం: మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న జడ్జిలు

పర్లాకిమిడి: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ అన్నారు. స్థానిక దేవగిరి రేంజ్ కార్యాలయం బోయకొండ మీద వన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ మాట్లాడుతూ భావితరాలకు ప్రాణ వాయువు అందించాలంటే మొక్కలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పుడున్న అధిక వేడి, కాలుష్యాన్ని నివారించేందుకు విరివిగా మొక్కలు నాటుదామని పిలుపునిచ్చారు. గజపతి జిల్లాలో వన మహోత్సవాలను ఏడు రోజుల పాటు పండగలా జరుపుకొని, నాలుగు లక్షల మొక్కలను నాటేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని డీఎఫ్‌వో ఎస్.ఆనంద్ తెలియజేశారు. ఎస్పీ స్వాతి కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుట్టిన రోజు నాడు ఒక మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులకు సీడ్ బాల్స్‌ను పంపిణీ చేశారు. జిల్లాలో మొక్కల పంపిణీకి ఏర్పాటు చేసిన మొబైల్ వాహనాలను కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్‌వోలు ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ కార్య నిర్వాహక అధికారి డా.గుణనిధినాయక్, సీనియర్ సిటిజన్ ఉపాంత ప్రహారి, పూర్ణచంద్ర మహాపాత్రో, సెంచూరియన్ పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జయపురం: వన మహోత్సవాల్లో భాగంగా జయపురం జిల్లా కోర్టు ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ జయపురం సభ్యులు జయపురం అటవీ విభాగ సహకారంతో స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ అధ్యక్షుడు సత్యనారాయణ ప్రారంభించారు. జీవరాశి మనుగడకు చెట్లను పెంచడం ఎంతో అవసరమన్నారు. వృక్ష సంపద పెరిగితే పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి, లోక్ అదాలత్ శాశ్వత విచారపతి సుమన్ జెన, విజిలెన్స్ స్పెషల్ జడ్జి రాజేష్ ఎక్కా, అదనపు జిల్లా జడ్జి బిద్యాధర పుష్టి, సివిల్ కోర్టు రిజిస్ట్రార్ బిష్ణు ప్రసాద్ దేవత, మహిళా కోర్టు విచారపతి అలకా నంద, సబ్ డివిజన్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ సంతోష్ కుమార్ బారిక్, మొదటి శ్రేణి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ అనిమేష్ జెన, జయపురం అటవీ విభాగ రేంజర్ సచ్చిదానంద పారిడ తదితరులు పాల్గొన్నారు.

రథయాత్రకు అందరి సహకారం అవసరం



రాష్ట్రస్థాయి సమన్వయ సమావేశంలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తదితరులు

● సీఎం మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: శ్రీజగన్నాథుని రథయాత్రను జయప్రదం చేయడానికి అందరి సహకారం అవసరమని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అన్నారు. పూరీ టౌన్ హాల్‌లో సీఎం అధ్యక్షతన రథయాత్ర రాష్ట్రస్థాయి సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. తోబుట్టువులతో శ్రీజగన్నాథుని రథయాత్ర సజావుగా జరిగేందుకు అన్నివర్గాల సేవకులు, అధికార యంత్రాంగం, వివిధ సామాజిక సంస్థలు మరియు స్థానిక ప్రజల సహకారం ఎంతైన అవసరమని పిలుపునిచ్చారు. ఆదివాసీలు (గిరిజనులు) మహాప్రభు జగన్నాథునికి అసలైన సేవకులని పేర్కొన్నారు. ఆదివాసీగా తాను పూర్తిగా జగన్నాథునికి అంకితమయ్యానని చెప్పారు. జగన్నాథుడు ఒడియా జాతికి గుర్తింపు, స్వామి రథయాత్ర ప్రపంచం మొత్తానికి ముఖ్యమైన మతపరమైన మరియు ఆధ్యాత్మిక పండుగ కావున అందరూ అత్యంత అంకితభావంతో, బాధ్యతతో ఉండాలని విజ్ఞప్తి చేశారు. దేశ, విదేశాల నుంచి వచ్చే లక్షలాది మంది భక్తులు, యాత్రికులకు యాత్ర అపురూప జ్ఞాపకంగా నిలిచిపోయేలా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సమావేశానికి ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు కనక్ వర్ధన్‌సింగ్ దేవ్, ప్రభాతి పరిడా, న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి, సీనియర్ ప్రభుత్వ అధికారులు, మహాప్రభువు సేవకులు హాజరయ్యారు.



సమావేశానికి హాజరైన యాత్ర నిర్వహణ యంత్రాంగం

పూరీకి వచ్చే సందర్శకుల లెక్కింపు

● ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా



భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథుని రథయాత్ర విశ్వ విఖ్యాతం. ప్రపంచ నలుమూలల నుంచి యాత్రకు విశేష సంఖ్యలో భక్తులు తరలివస్తారు. అయితే ఏటా ఈ యాత్ర రోజున ఎంతమంది యాత్రికులు వస్తున్నది గణాంకాల వివరాలు అదుబాటులో ఉండడం లేదు. దీంతో ఈ ఏడాది రథయాత్ర పురస్కరించుకుని సరికొత్తగా రాష్ట్ర ప్రభుత్వం పూరీకి వచ్చే భక్తుల సంఖ్యను లెక్కించాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా మంగళవారం వెల్లడించారు. రథయాత్ర రోజున ఒడిశా, దేశంలోని వివిధ ప్రాంతాలు, వెలుపల నుంచి లక్షలాది మంది యాత్రికుల పట్టణానికి తరలివస్తుంటారు. కానీ వారి సంఖ్యను లెక్కించే వ్యవస్థ లేదు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం ఈ ఏడాది సందర్శకుల సంఖ్యను లెక్కించేందుకు కొత్త విధానాన్ని ప్రారంభించనుందని పేర్కొన్నారు. ఈ గణాంకాల ఆధారంగా వచ్చే ఏడాది జరిగే రథ యాత్రకు విచ్చేసే భక్తుల భద్రత, సౌకర్యాల కోసం అవసరమైన సన్నద్ధం చేసేందుకు యాత్ర నిర్వాహక యంత్రాంగానికి సహాయపడుతుందన్నారు. భువనేశ్వర్, కోణార్క్, బ్రహ్మగిరి నుంచి పూరీ పట్టణానికి అనుసంధానపరిచే మూడు ప్రధాన రహదారుల్లో వచ్చే సందర్శకులను లెక్కిస్తారు. ఆ రోజు పట్టణంలోకి వచ్చే బస్సులు, కార్లు, ఆటో రిక్షాలు, ద్విచక్ర వాహనాల సంఖ్య ఆధారంగా ఈ లెక్కింపు చేపడతారని వివరించారు. పూరీకి వెళ్లే అన్ని రైళ్లలోని ప్రయాణికులను కూడా లెక్కించనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా రథయాత్ర రోజున హోటళ్లు, లాడ్జిలు, మఠాలు, గెస్ట్ హౌస్‌లు, ధర్మశాలలు మరియు ఇతర వసతుల్లో బస చేసే యాత్రికులను పరిగణనలోకి తీసుకుంటామని వెల్లడించారు.

బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల వాగ్వాదం




రణరంగంగా మారిన క్యాంటీన్ ఛక్ ప్రాంతం

భువనేశ్వర్: పార్లమెంట్‌లో సోమవారం కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ప్రసంగంపై బీజేపీ, కాంగ్రెస్ యువజన విభాగం కార్యకర్తలు మంగళవారం సాయంత్రం నగరంలోని నడివీధిలో వాగ్వాదానికి దిగారు. పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ చేసిన హిందూ వ్యతిరేక ప్రకటనలను నిరసిస్తూ నగరంలోని మాస్టర్ క్యాంటీన్ స్క్వేర్ వద్ద బీజేపీ యువ మోర్చా కార్యకర్తలు ప్రదర్శన నిర్వహిస్తుండగా హింసాత్మక ఘర్షణ జరిగింది.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడికి వ్యతిరేకంగా వారు నినాదాలు చేస్తుండగా, వారిలో కొందరు ఆయన పోస్టర్‌పై రాళ్లు మరియు ఆవు పేడను విసిరారు. స్క్వేర్ సమీపంలోని పార్టీ ప్రధాన కార్యాలయం కాంగ్రెస్ భవన్ ముందు ప్రదర్శనలో ఉంచారు. దీంతో కాంగ్రెస్ కార్యకర్తలు సంఘటనా స్థలానికి చేరుకుని నిరసన తెలుపుతున్న బీజేపీ కార్యకర్తలకు సవాల్ విసిరారు. అక్కడ మోహరించిన పోలీసులు వారిని శాంతింపజేసేందుకు ప్రయత్నించగా, కాంగ్రెస్ యువజన విభాగం ఎస్‌యూఐ సభ్యులు కూడా అక్కడకు చేరుకోవడంతో ఘర్షణ మరింత ఉద్రిక్తంగా మారింది. ఇరువర్గాల కార్యకర్తలు ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకోవడంతోపాటు అక్కడ నిలిపి ఉన్న వాహనాలపై దాడులు చేసుకోవడంతో ఆ ప్రాంతం రణరంగంగా మారింది. ఈ ఘటనలో కొన్ని వాహనాలు కూడా ధ్వంసమైనట్లు సమాచారం. ఎన్‌ఎస్‌యూఐ కార్యకర్తల దాడిలో గాయపడిన 7 మంది సభ్యులను చికిత్స కోసం స్థానిక క్యాపిటల్ ఆస్పత్రిలో చేర్పినట్లు సమాచారం.

కోలుకుంటున్న జగన్నాథుడు

● తులసీ దళంతో పూజార్చనలు



తులసీ దళార్చిత శ్రీజగన్నాథుడు

భువనేశ్వర్: జ్యేష్ఠ పూర్ణిమ నుంచి అస్వస్థతకు గురైన జగన్నాథుడు క్రమంగా కోలుకుంటున్నాడు. పదో రోజున దశ మూలికల మోదకం స్వామి చికిత్స కోసం కవిరాజు వైద్య వర్గీయులు సిద్ధం చేశారు. మర్నాడు (మంగళవారం) ఏకాదశి తిథి పురస్కరించుకుని స్వామి చికిత్స ప్రక్రియలో ఈ మోదకం వినియోగించడంతో ఆరోగ్యం కోలుకుంది. అస్వస్థతతో స్వామి ధవళ వర్ణ ఏక వస్త్రధారిగా కనుమరుగున చికిత్స ఉపచారాలు పొందుతున్నాడు. మోదక సేవనతో కోలుకుని మంగళవారం నాటి వర్ణ వస్త్రధారణతో ఆరోగ్యం కోలుకున్న సంకేతం జారీ చేశాడు. అలాగే స్వామి అస్వస్థత కారణంగా నైవేద్యం సందర్భంగా నిశ్శబ్దత కోసం ఘంటానాదం నివారించారు. ఆరోగ్యం కోలుకోవడంతో ఏకాదశి నాడు విస్తరి సేవ సందర్భంగా ఘంటానాదంతో శ్రీమందిరంలో అలికిడి ఆరంభమైంది. ఇది పరోక్షంగా భక్తులకు స్వామివారి ఆరోగ్యం కోలుకుందనే తియ్యని కబురు ప్రసారం చేసింది. పూర్ణిమ నుంచి ఏకాదశి తిథి వరకు స్వామి అనారోగ్యం కారణంగా తులసి చందనాదులు నివారించి తెల్లని పువ్వులు మాత్రమే వినియోగించారు. ఏకాదశి నుంచి తులసి, చందన, పుష్పాదులతో స్వామి గుభాళించాడు. ఈ సందర్భంగా పవిత్ర ఖొల్లీ (విస్తరి) సేవ ప్రత్యేకంగా నిర్వహించడం ఆచారంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా దైతపతి, పతిమహాపాత్రో వర్గం సేవాయత్‌లు బలభద్ర స్వామి, దేవీ సుభద్ర మరియు శ్రీ జగన్నాథునికి చందన లేపనం చేశారు. చందనంలో కర్పూరం, కేసరి, కస్తూరి తగిన పరిమాణంలో కలిపి సుగంధ భరితం చేశారు.

నేడు అనవసర ద్వాదశి

బుధవారం అనవసర ద్వాదశి. శ్రీజగన్నాథుని సంస్కృతిలో ఇది అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ తిథి నాడు రాజ నగరికి శ్రీమందిరం నుంచి రాజ ప్రసాదం చేరుతుంది. స్వామి తొలి సేవకుడు గజపతి మహారాజాకు స్వామి కోలుకున్న సందేశం అందజేయడం దీని ప్రాధాన్యత.

'సమస్యను పరిష్కరించండి'



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న ప్రజలు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని 7వ వార్డులో ఇటీవల కురిసిన వర్షాలకు బలిసాగర్ కోసం తీసిన 15 అడుగులు గోతుల్లోని నీరు ఇళ్లలోకి చేరడంతో నిత్యావసర సరుకులు, ఇతర సామగ్రి నీట మునిగాయి. దీంతో మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్‌మాడ్కమి స్వయంగా వెళ్లి పరిస్థితిని చూసి జిల్లా యంత్రాంగంతో చర్చిస్తానన్నారు. అయితే మంగళవారం ఉదయం వార్డుకు చెందిన 20 కుటుంబాలు స్వయంగా కలెక్టర్ కార్యాలయం వద్దకు వెళ్లి సమస్యను పరిష్కరించాలని కోరారు. వారి సమస్యను లెక్టర్ సచిన్ పవార్ విని సాయంత్రంలోగా నీటిని తోడాలని అధికారులకు ఆదేశించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

లారీని ఢీ కొన్న వ్యాన్



వ్యాన్ క్యాబిన్‌లో చిక్కుకొని ఉన్న డ్రైవర్ ప్రవీణ్‌కుమార్

నందిగాం: మండలంలోని పాలవలసపేట సమీప జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పలాసకు చెందిన కె.ప్రవీణ్‌కుమార్ క్లీనర్‌తో పాటు తన వ్యాన్‌లో హిరమండలం బయల్దేరారు. నందిగాం మండలం పాలవలసపేట వద్దకు వచ్చేసరికి తన వ్యాన్ బ్రేక్ ఫెయిల్ అవ్వడంతో అదే మార్గంలో వెళ్తున్న లారీని వెనుకనుంచి ఢీ కొట్టారు. దీంతో వ్యాన్ క్యాబిన్‌లో ఇద్దరు చిక్కుకున్నారు. ప్రమాదం గమనించిన స్థానికులు 108 వాహనానికి హైవే అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడకు చేరకున్న హైవే సిబ్బంది క్రేన్ సాయంతో వారిని బయటకు తీసి పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రిమ్స్ కళాశాల ఆఫీస్ సూపరింటెండెంట్‌గా సాయిరాం

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాల ఆఫీసు సూపరింటెండెంట్‌గా హనుమంతు సాయిరాంను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు విడుదల చేసింది. నర్సింగ్ కళాశాలలో పనిచేస్తున్న సాయిరాంను పదోన్నతిపై వైద్య కళాశాల ఆఫీసు సూపరింటెండెంట్‌గా నియమించారు. మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

● కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: పరిశ్రమలకు మంజూరు చేసిన భూమి వివరాలు తెలపాలని, పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా ఇండస్ట్రీస్ అండ్ ఎక్స్‌పోర్టు ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని ఆయన మంగళవారం నిర్వహించారు. ముందుగా పరిశ్రమల శాఖ, సంబంధిత చేనేత జౌళి, ఉద్యానవన, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, ఏపీఎంఐపి, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ తదితరులు చేపడుతున్న పనులపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమలకు మంజూరు చేసిన భూమి పరిశ్రమల నిర్వహణలో లేకుంటే వాటి వివరాలు తెలియజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించండి. పారిశ్రామిక యూనిట్లలో రసాయన ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు.

ఇన్‌చార్జి ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరావు, పరిశ్రమల శాఖ సహాయ సంచాలకులు రమణారావు మాట్లాడుతూ జిల్లాలో 23 భారీ పరిశ్రమలు రూ. 5885.69 కోట్ల పెట్టుబడితో స్థాపించి 12,769 మందికి ఉపాధి కల్పిస్తున్నాయని తెలిపారు. మరొక పరిశ్రమ నిర్మాణ దశలో ఉందన్నారు. 2023-2024లో 4597 ఎంఎస్‌ఎంఈలు రూ.412.00 కోట్ల పెట్టుబడితో స్థాపించి 16,515 మందికి ఉపాధి కల్పించాయన్నారు. 2024 మే మాసాంతానికి 369 ఎంఎస్‌ఎంఈలు రూ.10.10 కోట్ల పెట్టుబడితో స్థాపించి 1401 మందికి ఉపాధి కల్పించినట్లు తెలిపారు.

సులభతర వాణిజ్యం కింద పరిశ్రమలకు అవసరమైన అన్ని రకాలైన అనుమతులు ఆన్‌లైన్ ద్వారా 21 రోజుల్లో జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఐడీపీ 2023-27 ప్రభుత్వం ప్రకటించినదని దీని ప్రకారం జనరల్, బీసీ అభ్యర్థులకు 15% ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీ రూ.20 లక్షలకు మించకుండా, మహిళలకు రూ.30 లక్షలకు మించకుండా ఇస్తామన్నారు.

భారత ప్రభుత్వం 2023 సెప్టెంబర్ 17న ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన అనే కొత్త పథకాన్ని ప్రారంభించిందని, సంప్రదాయ కళాకారులు చేతి పనిముట్లతో పనిచేసే క్రాఫ్ట్ వ్యక్తులకు గుర్తింపు సంపూర్ణ మద్దతును అందించడం కోసం ఈ పథకం పూర్తిగా జీఓఐ ద్వారా నిధులు సమకూరుస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్, సీటీఓ రాణీమోహన్, ఎల్‌డీఎం సూర్యకిరణ్, డ్వామా మేనేజర్ మురళీ, మైనింగ్ ఏడీ సత్యనారాయణ, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాస్, ఏపీఈపీడీఎల్ ఈఈ ఎల్సియస్ పాత్రుడు, చేనేత జౌళిశాఖ ఏడి సాయిప్రసాద్, ఉద్యానవన శాఖ ఏడీ ప్రసాదరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రామారావు, రఘునాథ్ రావు, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతుళ్లకు గాయాలు



గాయాలతో పడి ఉన్న బొల్లు సూరిబాబు

బూర్జ: ఉవ్వపేట-వావాం గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో బొల్లు సూరిబాబు, త్రినేత్రలకు గాయాలయ్యాయి. గ్రామస్తులు, స్థానిక పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. మండలంలో గల ఉవ్వపేట గ్రామానికి చెందిన త్రినేత్ర శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు కాలేజీలో బీఏ మూడో సంవత్సరం చదువుతోంది. ఆమెను తండ్రి సూరిబాబు బైక్‌పై గ్రామం నుంచి బూర్జ జంక్షన్‌కు తీసుకెళ్తుండగా పాలకొండ డిపోకు చెందిన ఆర్టీసీ స్టూడెంట్స్ బస్సు బూర్జ గ్రామం వైపు నుంచి ఉవ్వపేట గ్రామం వైపు వస్తూ ఈ బండిని ఢీకొట్టింది. దీంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. స్థానికులు 108 సాయంతో వీరిని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. బొల్లు సూరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బస్సు బూర్జ పోలీసు స్టేషన్ ఆవరణలో ఉంచారు.

క్లుప్తంగా

పుష్పాలంకరణలో పైడితల్లి



ప్రత్యేక అలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు చదురుగుడి, వనంగుడిలలో మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువ జామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావు, నేతేటి ప్రశాంత్‌లు శాస్త్రోక్తంగా నిత్య పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

● జేసీ కార్తీక్



ఉత్పత్తులను పరిశీలిస్తున్న జేసీ కార్తీక్

విజయనగరం అర్బన్: ప్రజల ఆరోగ్యం కోసం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించాల్సి ఉందని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ అన్నారు. ప్రతి ఒక్కరూ వారి కుటుంబం, తమ ఆరోగ్యం కోసం ఈ ఉత్పత్తులనే వినియోగించాలని పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలను జాయింట్ కలెక్టర్ కార్తీక్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిలాలోని వివిధ ప్రాంతాలకు చెందిన రైతు శాస్త్రవేత్తలు, మెంటార్‌లు ఏటీఎం, ఏ1 విధానాల ద్వారా పండించిన వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను తిలకించి ఆయా వ్యవసాయోత్పత్తుల పంట దిగుబడి, లభిస్తున్న ఆదాయం, వాటి మార్కెటింగ్ అంశాలపై రైతులు, వ్యవసాయ అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వీటీ రామారావు, ప్రకృతి వ్యవసాయ విభాగం డీడీ ఆనంద్, వ్యవసాయ శాఖ డీడీలు ప్రకాశ్, హేమసుందర్, ఏపీపీఎస్ఎఫ్ ప్రతినిధి రమేష్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రత్నం తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి వినతుల వెల్లువ



సమస్యలను పరిష్కరించాలని మంత్రి సంధ్యా రాణికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

సాలూరు: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ కార్యకర్తలు, మున్సిపల్ పాఠశాలల స్వీపర్లు వేర్వేరుగా వినతి పత్రాలను స్త్రీ శిశు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి మంగళవారం అందజేశారు. ఈ మేరకు మంత్రి సంధ్యారాణిని పట్టణంలోని ఆమె స్వగృహంలో వారు కలిశారు. ఈ సందర్భంగా తమ వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వినతిపత్రాల్లో పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్‌గా హరికృష్ణ ఎన్నిక

పార్వతీపురంటౌన్: ఏఐఎస్ఎఫ్ పార్వతీపురం మన్యం జిల్లా కన్వీనర్‌గా హరికృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మన్మథరావు హరికృష్ణకు కండువా కప్పి అభినందనలు తెలిపారు. అనంతరం హరికృష్ణ మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ సమరశీలమైన ఉద్యమాలు చేస్తుందని, భవిష్యత్తులో జిల్లాలో విద్యారంగ సమస్యలపై నిత్యం పోరాటం చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ మిగులు సీట్ల భర్తీకి 9న కౌన్సెలింగ్

సీతంపేట: పెద్దమడి బాలుర గిరిజన జూనియర్ కళాశాలలో మిగులు సీట్ల భర్తీకి ఈనెల 9న ఐటీడీఏలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ-1, బైపీసీ-4, సీఈసీ-14 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2024లో పదో తరగతి పాసైన బాలురు మాత్రమే అర్హులుగా పేర్కొన్నారు.

ఆర్గానిక్ సాగులో 'రాజు'

- 'సేద్యం' చేసిన చూపిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్
- లక్షల్లో జీతం వదిలి సేంద్రియ వ్యవసాయం
- 26 ఎకరాల్లో వివిధ రకాల కూరగాయల పెంపకం
- ఏటా 300 టన్నులకు పైబడి ఇతర రాష్ట్రాలకూ ఎగుమతి



ప్రకృతిసేద్యంలో వేసిన కర్బూజాను చూపిస్తున్న యువఇంజినీర్ అప్పలరాజు

పూసపాటిరేగ: కాన్పూర్ ఐఐటీలో చదివి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడిన సిమ్మ అప్పలరాజు లక్షలాది రుపాయల జీతాన్ని వదిలి సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేశారు. ప్రముఖ సామాజిక వేత్త అన్నాహజారే స్ఫూర్తితో సేంద్రియ సాగు చేసి ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు తమ వంతు కృషి చేయాలని భావించారు. ఈ నేపథ్యంలో 26 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని సేంద్రియ పద్ధతిలో కూరగాయలు సాగు చేస్తున్నారు. వచ్చిన ఫలసాయాన్ని నామమాత్రపు ధరకే విక్రయిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాలోని పెదపాడు తంగివానిపేటకు చెందిన యువ ఇంజినీర్ సిమ్మ అప్పలరాజు వ్యవసాయంపై మక్కువతో ఉద్యోగాన్ని వదిలిపెట్టి విజయనగరం జిల్లా పూసపాటిరేగ పెట్రోల్‌బంకు సమీపంలో 26 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. సాగులో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధిస్తున్నారు. రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు లేకుండా సేంద్రియ వ్యవసాయం చేస్తూ వివిధ రకాల కూరగాయలు పండిస్తున్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని భావించిన ఆయన సేంద్రియ సాగు పద్ధతిలో సాగు చేసిన ఉత్పత్తులను ప్రోత్సహిస్తుండడంతో ఆయా పంటలకు బాగా గిరాకీ పెరిగింది. గడిచిన ఐదేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తూ పండించిన పంటలను తమ ఇంటి నుంచే రాష్ట్రంతో పాటు దేశం నలుమూలలా ఎగుమతి చేస్తున్నారు. ఆరోగ్యసమస్యలు ఉన్న వారికి నామమాత్రపు ధరకే పంటలను విక్రయిస్తున్నారు. సేంద్రియ సాగులో టమాటో, కాప్సికమ్, బీర, వంకాయ, బెండ, క్యాబేజీ, కర్బూజాతో పాటు పలు కూరగాయలు పండిస్తున్నారు. ప్రకృతిసాగును ప్రభుత్వం ప్రోత్సహించడంతో గ్రామాల్లో ఇప్పటికే రైతులు కూడా ఆసక్తి కనబరుస్తున్నారు.

అరుదైన రకాల సాగు

ప్రకృతిసాగులో ఆయన అరుదైన టమాటో, బెండ, బీర, కాప్సికమ్, వంగ, బెండ, సొరకాయతో పాటు ఇతర రకాల కూరగాయలు పండిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు దేశం నలుమూలలా ఏటా 300 టన్నుల వరకు కూరగాయలు ఎగుమతి చేస్తున్నారు. మితిమీరిన రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం పలు అనర్థాలకు తావిస్తుందని ఈ సందర్భంగా అప్పలరాజు హితబోధ చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం లభిస్తుందని తెలిపారు. సేంద్రియ సాగు ద్వారా పండించిన కూరగాయలు వినియోగిస్తే బీపీ, షుగర్, ఆస్తమా వంటి వ్యాధులు నయమవుతాయని, ప్రకృతిసేద్యంలో పండించిన కూరగాయలకు మార్కెట్‌లో బాగా గిరాకీ ఉన్నట్లు తెలియజేశారు. ఆర్గానిక్ సాగు చేయడంలో కలిగిన సంతృప్తితోనే వ్యవసాయంపై మక్కువ బాగా పెరిగిందని అప్పలరాజు 'సాక్షి'కి తెలిపారు.



యువ ఇంజినీర్ అప్పలరాజు



వంగసాగు



ప్రకృతిసేద్యంలో క్యాబేజీ పంట



సొరకాయ సాగు

విద్యా సంస్థల బంద్ ను జయప్రదం చేయండి

- విద్యార్థి సంఘాల విజ్ఞప్తి



బంద్ వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: నీట్ పరీక్ష పేపర్ లీకేజీని నిరసిస్తూ ఈనెల 4న తేదీన దేశంలో గల విద్యాసంస్థల బంద్‌కు ఇచ్చిన పిలుపును విజయవంతం చేయాలని విద్యార్థి సంఘాలు కోరాయి. దీనికి సంబంధించి స్థానిక అమర్ భవన్‌లో విద్యార్థి సంఘాల సమావేశం మంగళవారం నిర్వహించారు. ముందుగా బంద్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.నాగభూషణం, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి.రాము, ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి ఎస్.గణేష్, పీడీఎస్‌ఓ నాయకుడు రాకేష్ మాట్లాడుతూ ఈ రోజుల్లో విద్యార్థులు బయటకు వచ్చి నిరసన తెలియజేస్తుంటే అక్రమ కేసులు పెట్టి విద్యార్థులను అణిచివేస్తున్న పరిస్థితి అని విచారం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంబిస్తోంది. ఇటీవల దేశవ్యాప్తంగా నీట్ పరీక్షలు నిర్వహించగా ఆ పరీక్ష రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి. జీవో నంబర్ 77ను రద్దు చేయాలి. పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం ఇటీవల ఆమోదించిన తప్పనిసరి నైట్ స్కోర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐఐటీ ముంబై నుంచి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వరకు విద్యార్థి సంఘాల నేతలపై అక్రమ కేసులు బనాయించడం, నిర్బంధం విధించడం ఆపివేయాలని కోరారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి పి గౌరీశంకర్, ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రసాద్, భాను, జ్యోతి, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి రాజు, పీడీఎస్‌ఓ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లాకు పతకాలు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన తైక్వాండో పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు పతకాలు సాధించారు. గత నెల 30, ఈ నెల 1వ తేదీల్లో విశాఖ వేదికగా జరిగిన పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు 4 బంగారు పతకాలు, 2 వెండి, 5 కాంస్య పతకాలు దక్కించుకున్నారు. అంతేకాకుండా బంగారు పతకాలు దక్కించుకున్న నలుగురు క్రీడాకారులు ఆగస్టు 1,2,3 తేదీల్లో విశాఖలోని పోర్టు స్టేడియంలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. బంగారు పతకాలు సాధించడంతో పాటు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన వారిలో చైతన్య, సృజన్, దీక్షశ్రీ, షణ్ముఖ్ అవినాష్‌లు ఉన్నట్లు జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ చారి తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులను జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులతో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి వేంకటేశ్వరరావు

శివారు భూములకు సాగునీరు

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



జలాశయం నుంచి సాగునీటిని విడుదల చేస్తున్న మంత్రి శ్రీనివాస్

గంట్యాడ: తాటిపూడి (గొర్రిపాటి బుచ్చిఅప్పారావు) జలాశయం శివారు భూములకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన జలాశయం నుంచి సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జామి, ఎస్.కోట, గంట్యాడ మండలాల్లోని 35 గ్రామాల్లో సుమారు 15,365 ఎకరాలకు సాగునీరు అందించే తాటిపూడి జలాశయం ఈప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తుందని తెలిపారు. వచ్చే ఏడాదికి కాలువల్లో పూడికలు తొలగిస్తామని చెప్పారు. విశాఖ నుంచి జలాశయానికి రావాల్సిన నిధుల కోసం ప్రయత్నం చేస్తామని తెలిపారు. పూర్తి భద్రతా ప్రమాణాలతో బోటును పునరుద్ధరించి ఈప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. కలెక్టర్ బీఆర్. అంబేడ్కర్ మాట్లాడుతూ వ్యవసాయం, సాగునీరు, విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆయా రంగాల అభివృద్ధికి ప్రణాళికలను రుపొందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, ఆర్‌డీఓ సూర్యకళ, ఇరిగేషన్ ఈఈ సీతారామనాయుడు, డీఈ గోవిందరావు, జేఈ తమ్మినాయుడు, ఎంపీడీఓ భవాని, తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరి మృతి

- మరో ఇద్దరికి తీవ్రగాయాలు



నర్సింహమూర్తి మృతదేహం



మృతి చెందిన రియాన్ హలం

బొండపల్లి: మండలంలోని అంబటివలస-నెలివాడ జంక్షన్‌ల మధ్య జాతీయ రహదారి (26)పై ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు బలంగా ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతువాత పడ్డారు. మరో ఇద్దరు తీవ్ర గాయాల పాలై జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మంగళవారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి ఎస్సై కె.లక్ష్మణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరంలోని కణపాకకు చెందిన గంట్యాడ నర్సింహమూర్తి(25) తన తల్లి సరోజినితో కలిసి గజపతినగరంలో ఒక శుభకార్యానికి బైక్‌పై వచ్చి తిరిగి సాయంత్రం ఇంటికి విజయనగరం వెళ్తున్నారు. అదే సమయంలో విజయనగరం నుంచి సాలూరు వెళ్తున్న బీహార్‌కు చెందిన రియాన్ హలం(25) బైక్‌పై వస్తూ బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్‌లు నడుపుతున్న ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు.

బైక్ వెనుక కూర్చున్న వారికి..

ప్రమాదంలో మృతి చెందిన నర్సింహమూర్తి తల్లి సరోజిని బైక్ వెనుకన కూర్చోగా తీవ్రగాయాలయ్యాయి. అలాగే బీహార్‌కు చెందిన రియాన్ బైక్ వెనుక కూర్చున్న స్నేహితుడు రోహిత్‌కు కూడా ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలయ్యాడు. దీంతో క్షతగాత్రులను, మృతదేహాలను 108 వాహనంలో విజయనగరంలోని మహారాజా కేంద్రాస్పత్రికి పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం



పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

చీపురుపల్లి: విజయనగరం నుంచి హౌరా వెళ్లే రైలు మార్గంలో గరివిడి సమీపంలోని రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు ఆమదాలవలస జీఆర్‌పీ హెచ్‌సీ చక్రధర్ తెలిపారు. ఆ వ్యక్తి రైలు నుంచి జారిపడ్డాడా? లేదంటే మరే ఇతర కారణాల వల్ల మృతిచెందాడో తెలియదని పేర్కొన్నారు. మృతుడికి దాదాపు 60 సంవత్సరాలు వయస్సు కలిగి, శరీరంపై నీలం రంగు జీన్ ఫ్యాంట్, నలుపు రంగు డ్రాయర్, తెలుపు రంగు బనియన్, ఆకుపచ్చ, తెలుపు రంగు గడులతో కూడిన ఫుల్‌హ్యాండ్స్ షర్ట్ ధరించి ఉన్నట్లు ఆయన తెలిపారు. అంతేకాకుండా మృతునికి తల వెనుక భాగం, రెండు చేతులు, కాలి మడమ, నడుము వెనుక భాగంలోను గాయాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. అలాగే నోరు, ముక్కు నుంచి రక్తస్రావం జరిగినట్లు మరకలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మృతుని ఆచూకీ తెలిసిన వారు ఫోన్ 9491106219 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అనధికార ఎరువుల పట్టివేత

పాచిపెంట: ఆంధ్రా, ఒడిశా సరిహద్దు గ్రామాలకు అనధికారికంగా తరలిస్తున్న ఎరువులను పట్టుకున్నట్లు ఏఓ తిరుపతిరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ, 13 బస్తాల ఎరువులు తరలిస్తుండగా రొడ్డవలస గ్రామ సమీపంలో పట్టుకున్నామన్నారు. రశీదులు లేకుండా ఈ ఎరువులను పాచిపెంట మండలానికి చెందిన ఆత్మకూరు శ్రీనువాసరావు అనే వ్యక్తి తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.కాగా అక్కడి రైతులకు పెట్టుబడిగా తాను ఎరువులు పంపిస్తున్నానని ఇకనుంచి వారికి నేరుగా నగదును పెట్టుబడిగా ఇస్తానని శ్రీనివాసరావు చెప్పినట్లు ఏఓ తెలిపారు.

అధికారులే పించన్ పంపిణీ చేయాలి

- టీడీపీ నేతలు పంచడం అప్రజాస్వామికం
- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీని అధికారులే చేయాలి తప్ప టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పంపిణీ చేయించడం సమంజసం కాదని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన సాలూరు పట్టణంలోని తన గృహంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రజాప్రతినిధులను పిలవకుండా చాలా ప్రాంతాల్లో స్థానిక టీడీపీ నాయకులతో అధికారులు పింఛన్లు పంపిణీ చేయించారని అసహనం వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తాము మండల, మున్సిపాలిటీ స్థాయిలో పింఛన్ సొమ్ము పంపిణీ కార్యక్రమం నిర్వహించే సమావేశంలో ఆ పంచాయతీ/ వార్డు ప్రజాప్రతినిధి ద్వారా సంబంధిత లబ్ధిదారుకు పింఛన్ సొమ్ము అందించామని గుర్తుచేశారు. వార్డుల్లో, గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి వలంటీర్లు అత్యంత పారదర్శకంగా పింఛన్ సొమ్ము నేరుగా లబ్ధిదారులకు అందజేసేవారని, ఎక్కడా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు వెళ్లేవారు కాదని వివరించారు. 2014లో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కలెక్టర్‌లతో ఏర్పాటుచేసిన సమావేశంలో, టీడీపీ కార్యకర్తలను చూసుకుని వెళ్లాలని చెప్పారని, అందుకే ఇప్పుడు వారికి పింఛన్ల పంపిణీలో అవకాశం ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. పింఛన్ సొమ్ము పంపిణీలో ఏదైనా అవినీతి జరిగితే సంబంధిత ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్, జిల్లా అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

చీపురుపల్లిలో బాణసంచా వెలుగులు



పట్టణంలోని గాంధీ బొమ్మ కూడలిలో బాణసంచా కాల్చుతున్న గుర్తు తెలియని వ్యక్తులు

- చర్చాంశనీయంగా మారిన బాణసంచా
- వ్యాపార సంస్థలపై దాడులే కారణమా
- గుర్తు తెలియని వ్యక్తులు బాణసంచా కాల్చిన వైనం
- జీఎస్టీ అధికారులు బృందం దాడుల నేపథ్యంలో..
- ఐదేళ్ల తరువాత కొత్తగా అనిపించిన అంశం

చీపురుపల్లి: ఇదేదో పండగ కాదు.. ఎన్నికల విజయోత్సవ వేడుకలు అంతకంటే కాదు.. చీపురుపల్లి పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో పలు చోట్ల ఒక్కసారిగా మంగళవారం రాత్రి 8.30 గంటల సమయంలో బాణసంచా కాల్చారు. ఎవరు కాల్చారో.. ఎందుకు కాల్చారో తెలియదు. బాణసంచా కాల్చిన అంశంపై స్థానికంగా చర్చాంశనీయాంశమైంది. జీఎస్టీ అధికారుల బృందం పట్టణంలోని వ్యాపార సంస్థలపై మంగళవారం దాడులు నిర్వహించింది. ఈ విషయం ముందుగానే తెలుసుకున్న వ్యాపార వర్గాలు మధ్యాహ్నం నుంచి తమ వ్యాపార సంస్థలను మూసివేశారు. పట్టణంలోని మెయిన్‌రోడ్ అంతా నిర్మానుష్యంగా మారింది. తీరా రాత్రి 8.30 గంటలయ్యే సరికి ఇలా బాణసంచా కాల్చడం స్థానికంగా చర్చకు దారి తీసింది. గత ఐదేళ్లలో ఈ పరిస్థితి ఎన్నడూ కనిపించలేదు. 2019 నుంచి 2024 వరకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడ ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా ఉన్న బొత్స సత్యనారాయణ పరిపాలనలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా వ్యాపారులు తమ వ్యాపారాలు కొనసాగించారని, ప్రభుత్వం మారిన అతి కొద్ది రోజుల్లోనే ఇప్పటికే రెండు సార్లు వ్యాపార సంస్థలపై అధికారులు దాడులు ప్రారంభమయ్యాయనే వాదన వ్యాపార వర్గాలు నుంచి వినిపించింది. జీఎస్టీ అధికారుల బృందం దాడుల నేపథ్యంలో నిబంధనల ప్రకారం వ్యాపారాలు సాగిస్తున్న సంస్థలు తప్ప మిగిలిన వారంతా తమ వ్యాపార సంస్థలను మూసివేశారు. గతంలో చిరు వ్యాపారులే అధికారులకు బలయ్యేవారు. ఇప్పుడు అధికారులు బృందం దాడులతో పెద్ద వ్యాపారులు కూడా వ్యాపారాలను మూసేయాల్సి వచ్చింది. చిరు వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో బాణసంచా కాల్చడం చర్చకు దారి తీసింది.

బియ్యం మాత్రమే పంపిణీ..!


- రేషన్ సరుకుల్లో కందిపప్పు, చక్కెరకు కోత



రామభద్రపురంలో బియ్యం పంపిణీ చేస్తున్న వాహనదారులు

రామభద్రపురం: ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ఈ నెల పంపిణీ చేసే రేషన్ సరుకుల్లో బియ్యం మాత్రమే కార్డుదారులకు పంపిణీ చేస్తున్నారు. చక్కెర, కందిపప్పు, రాగులు, రాగిపిండికి కోత పెట్టారు.ఏవో సాకులు చూపి మిగిలిన ఇవ్వకుండా కోతలు పెట్టారని రేషన్‌కార్డు లబ్ధిదారులు విమర్శిస్తున్నారు. బొబ్బిలి నియోజకవర్గంలోని బొబ్బిలి మండలంలో 35,954, బాడంగి 14,813, రామభద్రపురం 15,328, తెర్లాం 18,742 రేషన్ కార్డులు ఉన్నాయి. అయితే కూటమి ప్రభుత్వం కార్డుదారులను ఈ నెల బియ్యానికే పరిమితం చేసింది. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు,పంచదారల రేట్లు అధికంగా ఉండటంతో ఈ సరుకులు కొనుగోలు చేసి తినే పరిస్థితి లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కందిపప్పు కిలో రూ.120కి పైనే ధర పలుకుతోంది. ఇలాంటి తరుణంలో రేషన్‌లో కందిపప్పు పంపిణీ చేయకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు, పంచదార పంపిణీ చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై సీఎస్‌డీటీలు ధనలక్ష్మి, స్వర్ణలతలను వివరణకోరగా గోదాంలకు ఒక్క బియ్యం మాత్రమే స్టాక్ వచ్చిందన్నారు. కందిపప్పు,పంచదార స్టాక్ రాలేదని, దీంతో ఆ రెండు సరుకులు పంపిణీ చేయడం లేదన్నారు. వచ్చే నెలలో స్టాక్ వస్తే పంపిణీ చేస్తామని తెలిపారు

13న తోటపల్లి పాత ఆయకట్టుకు నీరు విడుదల



తోటపల్లి జలాశయం

వీరఘట్టం: తోటపల్లి జలాశయం పరిధిలోని పాతఆయకట్టుకు ఈ నెల 13న సాగునీరు విడుదల చేస్తామని జలవనరుల శాఖ డీఈఈ దమలపాటి రవికుమార్ మంగళవారం తెలిపారు. పార్వతీపురం మన్యంతో పాటు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు సరఫరా చేస్తామన్నారు. జలాశయం పరిధిలోని చెరువులను నింపేందుకు తొలుత ప్రాధాన్యమిస్తామని చెప్పారు. ప్రణాళికా బద్ధంగా 64 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు సరఫరా చేస్తామని తెలిపారు.

కొత్త కలెక్టర్‌గా శ్యామ్‌ప్రసాద్

- బదిలీ అయిన ప్రస్తుత కలెక్టర్ నిషాంత్‌కుమార్



కొత్త కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌గా ఎ.శ్యామ్‌ప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన పల్నాడు జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ ఇక్కడ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇక్కడ కలెక్టర్‌గా పని చేస్తున్న నిషాంత్ కుమార్ బదిలీ అయ్యారు. ఈయన జిల్లా ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. జిల్లా తొలి కలెక్టర్‌గా చరిత్రలో నిలిచారు. 2024 సాధారణ ఎన్నికల్లో జిల్లా ఎన్నికల అధికారిగా, అరకు పార్లమెంట్ రిటర్నింగ్ అధికారిగా సమర్థవంతంగా విధులు నిర్వహించారు. జిల్లాలో మొబైల్ టవర్ల ఏర్పాటు, ప్రిజం కార్యక్రమాల నిర్వహణ, ఊరూరా గ్రంథాలయాల ఏర్పాటు, రైతుల ధాన్యం కొనుగోలు వంటి అంశాల్లో తనదైన ముద్రవేశారు.